# దారిద్ర్యాన్ని పారద్రోలండి

—పచ్చిసీలం నాగ సత్యనారాయణ

ఆవేదన తప్ప ఆనందం అంటే ఏమిటో ఎరగని ఆనందరావు సంసారాన్ని ఈది ఈది సహాయం కోసం చేతులు చాచి యాచించటానికి బయల్దేరాడు.

ఈ దేశంలో ఎంతోమంది పేదవాళ్ళల్లో అతనొకడు.

ఒక్క మనిషి బ్రతుకే భారంగా గడుస్తున్న యీ రోజుల్లో వయసుకు, మనసుకు ఎదురు తిరగలేక భార్య అనే బంధాన్ని తగిలించుకొని నలుగురి బిడ్డలకు తండ్రి అయ్యాడు.

బి. ఎ వరకు పఠించి, ఒక యింటి వాడిని చేసి బాధ్యత తీర్చుకున్న పెద్దవాళ్ళు కళ్ళుమూశారు. వారసత్వంగా రెండు వేలు అప్పు సంక్రమించింది. డిగ్రీ పుచ్చుకొని, కళ్ళల్లో ఆశా దివిటీలు వెలిగించుకొని ఉద్యోగాన్వేషణకు కాళ్ళరిగేలా తిరిగాడు. కాసులున్న వాళ్ళకు, సిఫార్సులున్న వాళ్ళకు మాత్రమే గవర్నమెంటు ఉద్యోగాలన్న సత్యాన్ని గ్రహించాడు. ఆశాదివిటీలు ఆరిపోయాయి. కాని అంధకారంలో ఆశా కిరణంలా ఒక ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం సంపాదించగలాడు నెలకు నూట నలభై రూపాయిలతో సంసారాన్ని ఈదుతున్నాడు. అప్పు ఆరువేలై కూర్చుంది. ఉన్న యిల్లు కాస్తా అప్పులవాళ్ళ పరంచేసి అద్దె యింట్లో ఉంటున్నాడు ఆనందరావు.

పీక్కుపోయిన మొహం, లోతుకుపోయినకళ్ళు, మాసినగడ్డం, తైల సంస్కారం లేని జుట్టు, మోకాలివద్ద దరిద్ర దేవత తొంగిచూస్తున్న పైజమా, దరిద్రదేవత తొంగిచూడకుండా అద్దులు ఏర్పర్చిన లాల్చీ. ఆకలికి అలవాటుపడి వెన్నుకంటుకు పోయిన కడుపు. నిత్యం రాలుతున్న భారతమాత కన్నీటి బొట్లలో ఆనందరావు ఒక బొట్టు.

నెల చివరిరోజున పస్తులు, అప్పులు అలవాటే సామాన్యపు మనిషికి. ఎన్ని పూటలైందో అన్నం తిని నీరసంగా రోడ్డు వార నడుస్తున్నాడతను.

వర్షం కురిసి వెలిసిందేమో వాతావరణం ప్రశాంతంగా ఉంది.

రోడ్డు మీద చాలమంది నడుస్తున్నారు. కొంతమంది గబగబా కొంతమంది నెమ్మదిగా. ఆనందరావు లాంటి వ్యక్తులు వాళ్ళల్లో ఎంతో మంది ఉన్నారు. వారందరి కష్టాలు ఒకటే, కాని పద్ధతులు వేరు

ఆనందరావుకి అంత దూరంలో ఒక చిన్నకారు రయ్యిమని దూసుకు పోయింది. అక్కడ గుంటలో నిల్చిన వర్షంనీరు ఒక్కసారిగ అతని మీద చిమ్మి కొట్టింది. పైజమాకి, లాల్చీకి ఒక ప్రక్కగా బురద మరకలు ఏర్పడి ఆనందరావుని వెక్కిరిస్తున్నాయి. చేత్తో తుడుచుకున్నాడు. అయినా వెక్కిరింపు మానలేదు.

చిన్నకార్లమీద పయనించే కొంతమంది ధనాంధులకు పేదవాళ్ళు కనపడరు కాబోలు; కార్లు, కాంతలు కాసులు, కానుకలు వీళ్ళకు ముఖ్యం. కనికరం శూన్యం.

బాధగా నిట్టూర్చి మరకల్ని తుడుచుకుంటూ కదిలాడు ఆనందరావు కొంత దూరం నడిచి ఒక సందులోకి వెళ్ళాడు.

వంపు చివరికంటావచ్చి ఒక యింటిముందు ఆగాడు

"వెంకట్రావు.... వెంకట్రావు" అంటూ తలుపు తట్టాడు తలుపు తెరుచుకొని ఓ లావాటి వ్యక్తి బయటికి వచ్చాడు.

"ఎవరూ?... ఓ!...నువ్వా!! .... ఏమిటిలా వచ్చావు?" అన్నాడు గుమ్మంబయటికి వచ్చి నిలబడి.

లోపలికి రమ్మంటాడేమోనని ఆశించాడు ఆనందరావు. కాని వెంకట్రావే బయటికి వచ్చి మాట్లాడటంబట్టి చూస్తుంటే తనరాక అతనికి యిష్టం లేనట్టుంది. "అవును మరి. యిప్పటికే వాడికి ముప్పైరూపాయిలు దాకా యివ్వాలి"—నిట్టూర్చాడు ఎలా చెప్పాలా అని సంశయిస్తున్నాడు ఆనందరావు అంతలో వెంకట్రావే అందుకున్నాడు.

"నేనే మీ యింటికి వద్దామనుకుంటున్నా రా!..."

ఆశ్చర్యంగా చూసాడు ఆనందరావు

"అదే....నువ్వు....ముప్పై యివ్వాలి గదా!... నాకు పెద్ద అవసరం వచ్చి పడిందిరా. నావైఫ్ సిస్టర్ మావగారు పోయారట. దినానికి వెళ్ళిరావాలి. ఎల్లుండే. నువ్వేమైనా యిస్తావని వద్దామనుకుంటున్నా. అంతలో నాకు శ్రమతప్పించి నువ్వేవచ్చావు. ఏమిటీ? డబ్బేమైనా తెచ్చావా?" అన్నాడు.

ఆనందరావు కళ్ళవెంట నీరు గిర్రున తిరిగాయి

"సారీరా .... ఈనెల సర్దలేను. రేపు ఫస్ట్‌కి యిచ్చేస్తా" అన్నాడు.

"పోన్లేరా. రేపు ఫస్ట్‌కే యివ్వు. నేనేమి బలవంతం పెట్టడం లేదుగా! స్నేహితుడ్ని ఆ మాత్రం ఆగలేనూ! నేనే ఎక్కడో తంటాలు పడ్తాలే.... ఊఁ.... ఏమిటీ? పని మీద వచ్చావా?" అన్నాడు.

"అబ్బే ఏమీలేదురా!.... ఊరికే...."

నసిగాడు ఏమీ చెప్పలేక అయిదుక్షణాలు మౌనం 'ఈ దరిద్రాన్ని ఎలా వదిలించుకోవాలా?' అని వెంకట్రావు ఆలోచన— 'వీడికి ఎలా, ఏవిధంగా చెప్పాలా' అని ఆనందరావు ఆలోచన. వెంకట్రావు ఆలోచనే గెల్చింది. యింట్లోకి తలతిప్పి—

"ఆ!.... వస్తున్నానే.... ఆనందరావు, నాకు లోపల చచ్చేటంత పనుంది. మళ్ళీ కలుద్దాంలే. వెళ్ళిరా" అంటూ వెంకట్రావు లోనికి వెళ్ళిపోయాడు తిరిగి చూడకుండా.

ఆనందరావు మనస్సు చివుక్కుమంది. కళ్ళల్లో కదలిన కన్నీటిని గబగబా తుడుచుకుని కదిలాడు నెమ్మదిగా.

స్థితి మారేసరికి స్నేహితులు సైతం చేతిని అతనిని వదిలేస్తారు.

నడుస్తున్నాడు ఆనందరావు ....కాదు .... ఆశ నడిపిస్తున్నది........

* * *

"చంటిదానికి పాలడబ్బా అయిపోయిందండి. రాత్రికి పాలు ఎలాగో అర్థం కావడంలేదు."

"పాపాయమ్మగారు పోస్తారేమో అడగకపోయావా?"

"అదీ అయ్యింది. ఇప్పటికే వాళ్ళకు ఆరు రూపాయలు యివ్వాలి. ఆ డబ్బు యిస్తేగాని పొయ్యవంటున్నది"

"హూఁ... నీ దగ్గరేమైనా డబ్బులున్నాయా?"

"ఈ రోజు యిరవై అయిదో తారీఖు. మర్చిపోయారా! ఏ నెలన్నా యీ తారీకుకు మన చేతిలో పైసా ఉందా?"

"అయితే యీ అయిదు రోజులు...."

"ఓ శేరు బియ్యం ఉన్నాయి. అవే సరిపెట్టుకోవాలి"

"వస్తులు మన కలవాటేగా .... వస్తుంటే యిల్లుగలాయనఎదురుపడ్డాడు నానామాటలు అన్నాడు."

"మీరు లేనప్పుడు యిక్కడికీ వచ్చాడు. మూడునెల్ల అద్దె ఫస్ట్‌కి యివ్వకపోతే బయటి

గొణుక్కుంటున్నాడు.

"హుం....ఖర్మ .... పెద్దోడికి జ్వరం ఎలా ఉంది?....అరె! వళ్ళుకాలిపోతున్నది. మందేమైనా వేసావా?"

"నిన్న డాక్టరురాసిచ్చిన చీటి మీపద్దనే ఉంది కదండి"

* *

"అబ్బా...." బాధగా అర్చాడు. కాలికేదో గ్రుచ్చుకుంది. గాజు పెంకు కాలి మడమలో దిగబడింది. వంగుని గాజు పెంకును బలంగా లాగాడు.

రోడ్డు ప్రక్కగా నడవమంటాయి రోడ్డు రూల్స్. రోడ్డు ప్రక్కగా నడుస్తే మున్సిపాలిటీవాళ్ళ నిర్లక్ష్య చిహ్నాలు చెప్పులు లేని నిర్భాగ్యులను నిర్దాక్షిణ్యంగా బాధ పెడ్తాయి.

చేతిలోకి వచ్చిన గాజు పెంకును దూరంగా విసిరివేసింది అతనిలో ఉండే మానవత యింకెవ్వరికి గ్రుచ్చుకోకుండా. నడుస్తుంటె మడమవద్ద నొప్పి పెడ్తుంది. భరిస్తూ, మడమ ఎత్తి నడుస్తున్నాడు. రోడ్డుదాటి రెండు సందులు తిరిగి ఒక యింటిముందు ఆగాడు.

"మోహన్ ... మోహన్ ...." తలుపు తట్టి పిల్చాడు. కొద్దిక్షణాలు లోపల్నుండి ఎటువంటి జవాబు రాలేదు.

"మోహన్....మోహన్...." ఈసారి కొంచెం గట్టిగా పిల్చి తట్టాడు.

తలుపు ప్రక్కనే ఉన్న కిటికి తెరలో నుండి ఎవరో బయిటికి చూసి వెళ్ళినట్టు గమనించాడు.

ఒక నిమషం అనంతరం ఆరేళ్ళ పాప తలుపు తీసింది.

పాపనుచూసి నవ్వుతూ "మీ నాన్న ఉన్నాడమ్మా?" అడిగాడు ఆశతో.

"మరే... నాన్నగారు ... యింట్లోలేరని చెప్పమన్నారు" అంది అమాయకంగా.

ఆనందరావు అంతా అర్థంచేసుకున్నాడు, యిక అక్కడ ఒక్క క్షణం వుండలేదు.

"తలుపు వేసుకో పాపా!" అని వెను తిరిగాడు.

ఆ సమయంలో పక్కింటి గుమ్మం వద్ద ఒక భిక్షగాడు దీనంగా అడుక్కుంటున్నాడు అమ్మా! తల్లీ! పిడికెడన్నం ఉంటె పెట్టండమ్మా! కడుపు మాడి పోతంది."

లోపల్నుండి అరుపు "అన్నం లేదు.... ఏమీ లేదు... పో.... పో...."

భిక్షగాడు కడుపుచేత్తో తడుముకుంటూ ఆనందరావుకి ఎదురు వచ్చాడు.

ఆనందరావుని చూసి ఆశతో "బాబూ! మీకు తోచింది ధర్మం చెయ్యండి. ఏదైనా కొనుక్కు తింటాను. కడుపు కాలిపోతంది. బాబూ!" అతి దీనంగా అడిగాడు.

ఆనందరావు ఒక పిచ్చి నవ్వు నవ్వి భిక్షగాడ్ని దాటి వెళ్ళిపోయాడు. భిక్షగాడు తెల్లబోయి అతడిని చూసి పిచ్చివాడనుకొని తానొక వెర్రినవ్వు నవ్వుకొని యింకో ఇంటి ముందుకు వెళ్ళాడు అడుక్కుంటూ.

ఆనందరావుకి కాళ్ళు పీకుతున్నాయి. సత్తువలోపిస్తున్నది. అయినా హృదయంలో ఎక్కడో ఎదో మూల చిన్న ఆశ అతనిని నడిపిస్తున్నది. శక్తిని కూడ దీసుకుని నడుస్తున్నాడు............

"నాన్న! నాకున్న రెండు చొక్కాలూ చినిగిపోయాయి. నాకు చొక్కాలు తేవూ!"

"నాన్న. ఆకలేస్తున్నది. బజార్నుండి ఏమన్నా తేవూ! అమ్మనడుగుతే అన్నం పెట్టదు. మంచినీళ్ళు తాగమంటది. నిన్న మధ్యానం తిన్నానంతే"

"అబ్బబ్బబ్బ....నోర్మూసుకొని అవతలకి పొండి"

"ఎందుకండి అలా కసురు కుంటారు? చూడండి ఎలా బిక్కమొహాలేసి నావద్దకు వచ్చారో. పరిస్థితులను అవగాహన చేసుకోలేని పసిహృదయాలు వాళ్ళవి వాళ్ళకి ఏదో విధంగా నచ్చచెప్పాలిగాని కసురు

కుంటారా?"

"కాంతా! నేను అసమర్థుడ్ని కాంతా! అసమర్థుడ్ని పిల్లల్ని పస్తులతో మాడుస్తున్న కిరాతకుడ్ని. కట్టుకున్న భార్య కడుపు నింప లేని కఠినుడ్ని. పసి వాళ్ళకు చొక్కాగుడ్డ కూడా తేలేని దౌర్భాగ్యుడ్ని"

"బాధ పడకండి. మనస్థితి ఎప్పటికైనా మారకపోదు. భగవంతుడు నిర్దయుడు కాదు. అన్నింటికి ఆ భగవంతుడే ఉన్నాడు."

"హుఁ.... భగవంతుడు?!! .......చూడు! చంటిది ఏడుస్తున్నట్టుంది. ఎత్తుకో... ప్రొద్దుట్నుంచి చంటిదానికి ఏం పట్టించావు? పాలెక్కడైనా దొరికినయ్యా?"

"పాలకు డబ్బు లెక్కడున్నాయండి. మంచినీళ్ళలో ఉప్పుకల్పి పట్టించాను .... మళ్ళీ అలాగే పట్టిస్తాను."

అప్రయత్నంగా వచ్చిన కన్నీటిని గబగబా తుడుచుకున్నాడు. ఎదురుగా తన స్నేహితుడు వస్తున్నాడు, బాగా డబ్బుగలవాడే. టెర్లిన్ స్లాక్ జేబులోనుండి పదిరూపాయల నోట్లదొంతర జేబును తన్నుకు వస్తున్నది కన్నెపిల్ల వంపులా.

ఆనందరావులో అణగారిపోయిన ఆశ చిగురించింది. ఎవరో అందాల చిలుకలు వెళుతుంటే తదేకంగా వాళ్లని చూస్తూ వస్తున్నాడు ఆనందరావు స్నేహితుడు.

ఆనందరావుని చూసి చూడనట్లు తప్పించుకోవాలనే ఉద్దేశ్యంతోటి చూపు చిలకల కులుకుల వైపు మరల్చి ఆనందరావుని దాటి వెళ్ళిపోతున్నాడు. గమనించాడు ఆనందరావు అయినా హృదయంలో మెదులుతున్న ఆశ ఊరుకో లేదు.

"లక్ష్మణా!.... ఒరే లక్ష్మణరావు" కేక వేసాడు. రెండవసారి గట్టిగా పిల్చాడు.

గబగబా వెళ్ళిపోతున్న లక్ష్మణరావు ఆగి పరీక్షగా చూసి, గుర్తుకు తెచ్చుకున్నట్టు నటించి "ఓరి, నువ్వట్రా ఆనందూ! నేనింకెవరో అనుకున్నాను ...... ఏమిటీ వాలకం? యిలా అయ్యావు? నిన్ను గుర్తు పట్టలేకపోయా సుమా!" అన్నాడు

ఆనందరావు చిన్నగా నవ్వాడు.

"ఏం చేస్తున్నా విప్పుడు?" అన్నాడు లక్ష్మణరావు రోడ్డుమీద వచ్చేపోయే జనాన్ని చూస్తూ. ఎవరన్నా తెల్సినవాళ్ళు కనబడ్డే వంకబెట్టి వాళ్ళతో వెళ్ళొచ్చనే ఉద్దేశ్యంతో.

"ఏదో చిన్న ఉద్యోగం. చాలీచాలని జీతం. నువ్వేం చేస్తున్నావురా?" అన్నాడు.

"మనది మామూలేగా. మా ఫాదర్ బిజినెస్‌లో తలదూర్చా.... ఊఁ.... పనిమీద వెళ్తున్నావా? వెళ్ళిరా... మళ్ళీ కలుద్దాంలే" అంటూ కదలబోయాడు ఆనందరావుని త్వరగా వదిలించుకోవాలని.

"లక్ష్మణా! చిన్న హెల్ప్ రా" అన్నాడు దీనంగా.

"ఏమిట్రా!"

"నీ దృష్టిలో అది పెద్ద విషయం కాదనుకో, కాని నా దృష్టిలో నువ్వు చేసే యీ చిన్న హెల్ప్ ఆరుగురి ప్రాణాల్ని నిలబెడ్తుంది."

"చెప్పరా?"

అడ్డొచ్చిన అభిమానాన్ని అవతలికి నెట్టి "ఓ పాతిక రూపాయలు అప్పుగా యివ్వరా! వచ్చేఫస్టుకి యిచ్చేస్తాను" అన్నాడు అతి దీనంగా.

తన మీద సమ్మెట దెబ్బ కొడతాడా! చల్లని పన్నీరు జల్లుతాడా! అని ఎదురు చూస్తున్నది ఆశ ఆనందరావు ఎదలో నుండి

"సారీ రా! నా జేబులో డబ్బు నాదనుకుంటున్నావా? పొరపడ్డావు. మా యింటి పక్కాయనది. ఆయనకిచ్చెయ్యమని ఓ వంద రూపాయలు యిచ్చారు మా ఫాదరు అదే యిది. నా ఖర్చుకి రూపాయి కావాలన్నా మా ఫాదర్‌ని అడగవల్సిందే.... సారీరా.... మరి నేవస్తా....ఏమీ అనుకోకు" అని సూపర్

ఎక్స్‌ప్రెస్ బస్‌లో వెళ్ళిపోయాడు. నిట్టూర్చాడు బాధగా ఆనందరావు.

జనంతో నిండిన మైదానంలో తెల్లటోపీ గంభీరోపన్యాసం ధారాళంగా సాగిపోతున్నది. ప్రజల కరతాళ ధ్వనులు మిన్ను ముట్టుతున్నాయి. ఆ ఒక్క అంగంట ప్రజల్ని ఆకర్షించుకునే నేర్పు ప్రజానాయకుడి సొత్తు. ఆ అంగంట సేపు ప్రజలంతా, డూ, డూ బసవన్నలే.

పాగాటికి ప్రజలు పదే పదే చప్పట్లు కొడుతున్నారు. నాయకుడి దీర్ఘోపన్యాసం దివ్యంగా సాగిపోతున్నది....

"....కాబట్టి యీ పరిస్థితులలో మనం ఏం చెయ్యాలి? ఈ దారిద్ర్య దేవత మన ఏం చేయాలి. కరువు కబంధ హస్తాలలో నుండి మన దేశంలో ప్రళయ నృత్యం చేస్తుంటే మనం ఎలా బయట పడాలి? మన దేశంలో ఎంత మంది బీదవాళ్ళు? ఎంత మంది నిరు పేదలు? ఎంత దరిద్రం? ఎంత పేదరికం? — ఒక పూట తింటే రెండో పూట కడుపు కాల్చుకునే దరిద్ర నారాయణులు ఎంతమంది? వీరి భవిష్యత్ ఏమిటి? వీళ్ళగతి యింతేనా? దానికి గాను మనం ఏం చెయ్యాలి? ప్రళయరూపం ధరించి విలయ తాండవం చేస్తున్న యీ యొక్క దారిద్ర్య దేవతను ఎలా తరిమి కొట్టాలి? ఏం చెయ్యాలి?" బల్ల గుద్దాడు నాయకుడు, ప్రజలు చప్పట్లుకొట్టారు

"దీనికిగాను మేం ఆలోచించాం. యీ దారిద్ర్యాన్ని రూపుమాపదల్చాం.... తర్కించుకున్నాం .... మెదడును పదును పెట్టాం. ఫలితంగా ఒక నినాదాన్ని సృష్టించాం.

"దారిద్ర్యాన్ని పారద్రోలండి" — ఇదే ఆ నినాదం

— ఆనందరావు ముందు నిల్చొన్న వ్యక్తి తన సిల్కు లాల్చీ జేబులో నుండి జేబు రుమాలుతీసి ముఖం తుడుచు కుంటున్నాడు. రుమాలు తీసినప్పుడు దానితో పాటు ఒక వందరూపాయల నోటు జేబు పై వరకు వచ్చి ఆగిపోయింది. రుమాల్ని పొమ్మని, జేబుల్లో నుండి తొంగిచూస్తూ ఆనందరావుని వెక్కిరిస్తున్నది.

అప్రయత్నంగా ఆనందరావు. ఆ నోటు వంక చూసాడు.

ఆ వ్యక్తికి చెప్పదామను కొంది అతనిలో ఉన్న నిజాయితీ. కాని అతని దారిద్ర్యం అతన్ని చెప్పకుండా ఆపింది.

మనసు వక్రించింది.

ఆత్మ ప్రోత్సహించింది.

అంతరాత్మ తప్పని అరిచింది.– శరీరం వణికింది.

కళ్ళు నోటునే తదేకంగా చూస్తున్నాయి.

కూడదంటున్నది అతనిలోని నిజాయితీ.

కానివ్వమంటున్నది అతని దరిద్రం.

చంటిదానికి పాలడబ్బా— పెద్దోడి జ్వరం, మందులు — పిల్లలకు చొక్కాలు — భార్యకొక్క చీరె — కడుపుకు తిండి — ఇంటి అద్దె యీ సమస్యలన్నీ అతనిచుట్టూ ఒక్కసారి గిర్రున తిరిగి బలవంతపెట్ట సాగాయి. ఆ బలవంతానికి అతను లొంగిపోయాడు

ఆ వ్యక్తి జేబురుమాలను చేతోనే పట్టుకొని ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటున్నాడు.

పిల్లలంతా తనముందు నిల్చొని "నాన్నా! ఆకలి ఆకలి" అని దీనంగా, ఏడుస్తూ అడుగుతున్నారు ఆనందరావుని.

అంతరాత్మకు నచ్చచెప్పుకున్నాడు.

భయాన్ని కొంత దూరంగా నెట్టాడు.

అటూ, యిటూ చూస్తూ నోటుని లాగబోయాడు.

అదే సమయంలో ప్రక్కనేఉన్న యింకో వ్యక్తి నోటును లాగుతున్న ఆనందరావును చూసి అర్చాడు.

"దొంగ...దొంగ.. అరె, మీ జేబులో డబ్బు కొట్టేస్తున్నాడండీ" అన్నాడు.

నోటు గల వ్యక్తి కంగారుగా జేబు తడుముకుంటూ, ఆనందరావు చేతిలో ఉన్న

వంద రూపాయల నోటును గభాల్ని లాక్కొని చేతిని గట్టిగా పట్టుకున్నాడు. "దొంగ రాస్కెల్" అంటూ ముఖంలో రంగుల్ని మారుస్తున్నాడు.

అప్పుడే ఇరవై ముప్పైమంది జనం ఆనందరావు వైపు అసహ్యంగా, ఆవేశంగా చూడసాగారు - తాము పెద్ద నిజాయితీపరుల మని ముఖంలో భావాల్ని వ్యక్తం చేస్తూ.

ఆనందరావు మనస్సులోని భీతి ఒక్కసారిగ పెల్లుబికి ప్రవహించ సాగింది.

అంతే. చేతిని వదలించుకొని లేని శక్తిని కూడదీసుకుని జనాన్ని తప్పించుకుంటూ పరుగెత్త సాగాడు.

"దొంగ దొంగ- పారిపోతున్నాడు. పట్టుకోండి పట్టుకోండి" అర్చారు కొంతమంది.

కొందరు ఆనందరావు వెంట బడ్డారు. పరుగెత్తుతున్న ఆనందరావు గుండెవేగం పెరిగింది. ఆయాసం అధికమయింది. కాళ్ళల్లో ఉన్న కొద్దిపాటి శక్తి క్షీణించి పోతుంది.

అక్కడ వేదికమీద నాయకుడు గొంతు చించుకుంటున్నాడు.

"....... దారిద్ర్యాన్ని పారద్రోలండి. దారిద్ర్యాన్ని పారద్రోలండి...." అంటూ ప్రజల నినాదాలు మిన్ను ముట్టాయి.

ఆనందరావు దరిద్రుడు.

జనం ఆ దరిద్రుడ్ని పారద్రోలుతున్నారు. వాళ్ళల్లో ఒకడు పరుగెత్తుతూ చేతికి దొరికిన కంకరరాయితో గురి చూసి విసిరాడు బలంగా. అతని తల చిట్లి నెత్తురు బయటికి చిమ్మింది. అంతే— అతని కళ్ళముందు ఆ ప్రదేశమంతా గిర్రున తిరిగింది.

సుఖ దుఃఖాల కతీతమైన మరో లోకం క్షణం సేపు కనబడింది. నానావిధాలుగా సంఘానికి బలైన దరిద్రులంతా కనబడి ఆనందరావును పిలుస్తున్నారు. "పిచ్చివాడా! ఈ దేశంలో, యీ సమాజంలో నీ లాంటి వాడు బ్రతగ్గలడా? బ్రతకనిస్తారా? వద్దు. రా. వచ్చెయ్. మా దగ్గరు వచ్చెయ్" అంటూ అందుకోవటానికి చేతులు జాపారు.

"ఉహూం....నేను రాను...నా పిల్లలు.... నా భార్య....వాళ్ళేమై పోతారు, నేను రాను. నేను రాను..." అంటూ ఆనందరావు స్పృహ కోల్పోయాడు ★

---

## 26-7-74

సంస్కారం కథ, బాబూ ఏడుస్తున్నావా, కవిత, బాపున్నాయి. గేయాలు రంధి సోమ రాజుగారు భలే యిస్త్రంగా రాస్తున్నారు. జ్ఞానం కలిగించే కథలు, కవితలు, వ్యాసాలతో, ప్రగతి వస్తున్నందుకు ఎడిటర్ గారికి అభినందనలు.

డి. రోహిణి, తిరుపతి.

ఈవారం 'ప్రగతి' ఆకర్షణీయంగా ఉంది. ప్రముఖ రచయిత శ్రీపినిశెట్టి శ్రీరామ మూర్తిగారి సీరియల్ పిచ్చోడి పెళ్ళి ప్రగతికి హైలెట్. వనితావాణిశీర్షిక మమ్మల్ని ఆకట్టు కుంటోంది. 'అభిప్రాయవేదిక'లోని సినిమా ప్రభావం గురించిన వ్యాసం మమ్మల్ని ఆలోచనా తరంగాలలో విహరింపజేసింది. 'విశ్వ సాహితి' వర్ధిల్లాలి.

కె. సంజీవన్‌గౌడ్, యం. రామస్వామి,
(ప్రగతి పెన్ ఫ్రెండ్స్ అసోసియేషన్)
పోచమ్మవాడ. జగిత్యాల్.

## ఉత్తరాలు

Edited, Printed and Published on behalf of Naveenandhra Printing, Industrial and Agricultural Company (P) Ltd. by M. Nagabhushanam, at Swatantra Art Printers, Vijayawada-4.